


# జీవాహారము

**మూలవాక్యము**:- **యోహాను 6:35:** అందుకు యేసు వారితో ఇట్లనెను, జీవాహారము నేనే; నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు, నాయందు విశ్వాసముంచు వాడు ఎప్పుడును దప్పిగొనడు.
ఈ లోకంలో రకరకాలైన ఆహారము ఉన్నప్పటికీ యేసుక్రీస్తు నేనే జీవాహారం అన్నమాట దేవుని గ్రంథంలో రాసి ఉన్నది. అందుకు కారణాలేంటి అని మనము దేవుని వాక్యము నుండి కొన్ని విషయాలు చూసుకుందాం.

**యేసు క్రీస్తు ఎలా జీవాహారం? :**

**యోహాను 1 : 1 – 4** ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై
యుండెను. [2] ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూటముగా కలిగెను,
[3] కలిగియున్నదేదియు ఆయనలేకుండ కలుగలేదు. [4] ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు
వెలుగైయుండెను.

**యోహాను 1 : 14** ఆ వాక్యము శరీరధారియై, కృపా సత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; ....

మనము ఈ వాక్యము చదువుతున్నప్పుడు మనకు ఒక ప్రశ్న రావాలి. మనము తింటున్న ఆహారములో జీవము ఉందా లేదా? మనము తీసుకునే ఆహారములో జీవము లేదు అందుకు కారణం మన తల్లిదండ్రులైన ఆదాము హవ్వ చేసిన అజ్ఞాతి క్రమమును బట్టి మరణమును సంపాదించుకున్నారు.

**ఆది 3:3-12** :- దేవుడు ఆదాము హవ్వలకు ఏమి తినాలి ఏమి తినకూడదు అని స్పష్టంగా తెలియజేశారు కాని హవ్వ సాతాను చేతిలో మోసపోయింది. హవ్వకు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములు తినకూడదని తెలుసు కానీ సాతాను చెప్పిన మాటలకు తను లొంగిపోయి రమ్యంగా కనిపించడం వలన తను ఆ పండ్లను ఆదాము హవ్వ ఇద్దరూ తిని దేవుని ఆజ్ఞను అతి క్రమించారు.
దేవుని ఆజ్ఞను అతిక్రమించినందువలన దేవుడు హవ్వను సాతానును, ఆదామును, ముగ్గురికి శిక్షను విధించెను.
దేవుడు కష్టపడకుండా ఆదాము హవ్వల కోసం ఆహారం నిమిత్తము అన్నిరకములైన పండ్లను ఆయన సిద్ధపరచాడు కానీ ఆజ్ఞను పాటించమని చెప్పారు.

**ఆది 3:19** :- నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు; ఏలయనగా నేలనుండి నీవు తీయబడితివి; నీవు మన్నే కనుక తిరిగి మన్నై పోదువు అని చెప్పెను.
దేవుడు ఆదామునకు ఇచ్చిన శిక్షను మనము గమనించినట్లుయితే, తినవద్దు అన్న పండును తినినతర్వాత మరణము అనే శిక్షను సంపాదించుకున్నాడు. పండు తినడం వల్ల వచ్చిన మరణమును తీసివేయడానికి ఆయన తిరిగి జీవాహారముగా మారాడు. ఆయన శరీరమును జీవాహారముగా మనకు ఇచ్చారు.

## జీవాహారంలో ఉన్న కొన్ని లక్షణాలను మనము తెలుసుకుందాం

### 1.జీవాహారము అనేది పరలోకము నుండి దిగివచ్చిన పరిశుద్ధమైన ఆహారం

**యోహాను 6:41-42** కాబట్టి నేను పరలోకము నుండి దిగివచ్చిన ఆహారమని ఆయన చెప్పినందున యూదులు ఆయనను గూర్చి సణుగుకొనుచు ఈయన యోసేపు కుమారుడైన యేసు కాడా? ఈయన తల్లిదండ్రులను మన మెరుగుదము గదా? నేను పరలోకము నుండి దిగివచ్చియున్నానని ఈయన ఏలాగు చెప్పుచున్నాడనిరి.

ఈ వాక్యములో ఉన్న ఆత్మీయ సత్యమును మనము గ్రహించాలి. యేసుక్రీస్తు జననము మనము జ్ఞాపకము తెచ్చుకున్నప్పుడు, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినది.

**మత్తయి 1:20**

ఈలోకంలో యేసుక్రీస్తు పుట్టుక పరిశుద్ధమైనది. కాబట్టే ఆయనశరీరము జీవాహారముగా మారింది. పాత నిబంధన కాలములో పాపమును తీసివేయడానికి బలులు అర్పించేవారు కానీ మరణమును ఎవరు తప్పించలేకపోయారు. కొత్తనిబంధన కాలములో

**యోహాను 6:58**

ఇదే పరలోకము నుండి దిగివచ్చిన ఆహారము. పితరులు మన్నాను తినియు చనిపోయినట్లు కాదు; ఈ ఆహారము తినువాడు ఎల్లప్పుడును జీవించునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను.

ఇక్కడ గమనించాల్సిన విషయం మన పితరులకు జీవాహారము దొరకలేదు దేవుని కృప కనికరము దయ కొత్త నిబంధన కాలములో వాళ్ళకి దేవుడు ఇచ్చాడు, సత్యం తెలుసుకొని యేసుక్రీస్తు శరీర రక్తమునుతీసుకునే వారు నిత్య జీవమునకు వారసులు.

**2.జీవాహారం అనేది ఎల్లప్పుడూ జీవింప చేసేది.**

**యోహాను 6:51**

పరలోకమునుండి దిగి వచ్చిన జీవాహారమును నేనే, ఎవడైనను ఈ ఆహారమును భుజించితే వాడెల్లప్పుడును జీవించును;

ఈ లోకంలో మనిషి అనేక గొప్ప గొప్ప సంగతులను కనుగొన్నాడు కానీ మనిషి మరణించకుండా జీవములోనే ఉన్నసంగతులు కనుగొనలేకపోయాడు. మనిషికి అసాధ్యమైన కార్యము దేవునికి సాధ్యము. దేవునివాక్యము స్పష్టముగా మనకు తెలియజేస్తుంది. యేసుక్రీస్తులో జీవము ఉంది. జీవము కలిగిన ఆహారము తీసుకున్నప్పుడు మనలోనికి ఆ జీవము ప్రవేశించి నిర్జీవముగా ఉన్నవాటిని జీవములోనికి నడిపిస్తుంది.

ఇక్కడ మనము గమనించాల్సిన విషయం జీవాహారము తినాలి అన్న ఆశ మనకు ఉండాలి. జీవాహారము తినడం వల్ల మన జీవితంలో ఏమి జరుగుతుంది అని మనము తెలుసుకోవాలి.

**యోహాను 6:53-54**

కావున యేసు ఇట్లనెను – మీరు మనుష్య కుమారుని శరీరము తిని ఆయన రక్తము త్రాగితేనే కానీ, మీలో మీరు జీవము కలవారు కారు.। నా శరీరము తిని నా రక్తము త్రాగువాడే నిత్యజీవము కలవాడు; అంత్య దినమున నేను వానిని లేపెదను.

జీవాహారము భుజించడం వల్ల మనము అంత్యదినమున తిరిగి లేస్తాం అన్న విషయము మనము జ్ఞాపకము పెట్టు కోవాలి. జీవాహారమునకు అంత్యదినమున లేపగలిగే శక్తి ఉన్నది. ఒక వ్యక్తి శారీరకంగా మరణించినప్పటికి ఆ వ్యక్తిజీవాహారము తిని ఉంటే ఆత్మీయంగా దేవుడు తిరిగి ఆ వ్యక్తిని లేపుతాడు.

**యోహాను 6:56**

నా శరీరము తిని నా రక్తము త్రాగువాడు నాయందును నేను వానియందును నిలిచి యుందుము.

ఏ వ్యక్తి అయితే జీవాహారము తింటాడో ఆ వ్యక్తి యందు దేవుడు నిలిచి ఉంటాడని వాక్యము మనకు స్పష్టంగా చెబుతుంది. దేవునికి మనిషితో నిలిచి ఉండాలి మనిషితో సహవాసం చేయాలి అని ఆశ కోరిక. అందుకని దేవుడు

ఈ సృష్టిలో ఆదాము, హవ్వలతో స్నేహం చేశాడు. ఆదాము, హవ్వలు పోగొట్టుకున్న సహవాసాన్ని తిరిగి మనిషికి అందజేయడం కోసం తన పరిశుద్ధమైన శరీరమును జీవాహారముగా మార్చాడు. మన జీవితంలో దేవుడు నిలిచి ఉండాలి అంటే యోగ్యముగా దేవుని శరీరము రక్తం మనము తీసుకోవాలి. ఆదాము హవ్వలు దేవుడు తినవద్దని చెప్పిన పండ్లు తినడం వల్ల జీవమును కోల్పోయారు కానీ యేసుక్రీస్తు శరీరము భుజించడం వల్ల జీవమును సంపాదించుకోగలుగుతాము.

**3. జీవాహారము అనేది లోకం కోసం ఇవ్వబడిన ఆహారం**

**యోహాను 6:51**

మరియు నేనిచ్చు ఆహారము లోకమునకు జీవము కొరకైన నాశరీరము అనిమీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను.
పై వాక్యము చదివినప్పుడు దేవుడు లోకమును ఎంతగా ప్రేమిస్తున్నాడో మనము చూడగలుగుతాము.
జీవము లేని లోకమును దేవుడు చూసి ఎంతగా ఆయన దుఃఖపడ్డాడో మనకు ఈ వాక్యమును బట్టి అర్థం చేసుకోవచ్చు. దేవుడు ప్రేమ స్వరూపి అని మనకు తెలియపరుస్తుంది.

**యోహాను 3:16**

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాస ముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.
దేవునికి లోకం పట్ల ఉన్న ప్రేమను మనము గమనించగలుగుతాం.తన అద్వితీయ కుమారుని మనకోసం ఆయన సిలువలో అప్పగించాడు. దేవునికి మనపట్ల ఎంత ప్రేమ అనేది మనము ఇక్కడ చూడగలుగుతాము. ఈ లోకంలో మనుషులను మన శరీరమును చాలా జాగ్రత్తగా చూసుకుంటాము. మన శరీరమునకు ఇబ్బంది వస్తే మనము తట్టుకోలేము. మన శరీరమును శ్రమపెట్టడానికి ఇష్టపడం.అంతలో కనిపించి అంతలో మాయమై ఆవిరి లాంటీ శరీరానికి మనుము చాలా జాగ్రత్తలు తీసుకుంటాము.
కానీ దేవుడైతే తన కుమారుని శరీరమును మనకోసం జీవాహారముగా మార్చాడు. తన కుమారుడైన యేసుక్రీస్తు శరీరమును సిలువ వేయడానికి, నలుగ కొట్టబడటానికి, అవమానం పొందడానికి, తండ్రి , కుమారుడు ఇష్టపడ్డారు.

ఈ లోకాన్ని దేవుడు ఎంత ఇష్టముగా ఆయన సృష్టించాడో మనము గమనించాలి. లోకంలో ఉన్న మానవుని, తన పోలిక చొప్పున, తన స్వరూపము మానవునికి ఇచ్చాడు. ఏ శరీరమును దేవుడు మానవునికి ఇచ్చాడో దానిని మానవుడు పోగొట్టుకున్నాడు. తిరిగి దానిని తీసుకురావడం కోసం, తన కుమారుని పంపి తిరిగి దానిని తీసుకొని వచ్చాడు. ఈ సత్యం మనమందరము గ్రహించాలి. దేవుడు తన కుమారుని శరీరమును జీవాహారముగా మార్చడానికి, కారణం దేవుడు సృష్టించిన మనిషి తిరిగి ఆయన దగ్గరకు చేరాలని.ః

**యోహాను 11:23-27** యేసు నీ సహోదరుడు మరల లేచునని ఆమెతో చెప్పగా। మార్త ఆయనతో – అంత్య దినమున పునరుత్థానమందు లేచునని ఎరుగుదుననెను. అందుకు యేసు పునరుద్ధానమును జీవమును నేనే. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును. బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్న టికిని చనిపోడు. ఈ మాట
నమ్ముచున్నావా? అని ఆమెను అడిగెను. ఆమె అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నానని ఆయనతో చెప్పెను.
మరియ, మార్త, లాజరు జీవితంలో జరిగిన అద్భుత కార్యమును దేవుని వాక్యంలో మనము చూడగలం.

దేవునియందు విశ్వసించే వారికి ఆయన అద్భుతము చేస్తాడు అని రుజువు చూపించాడు యేసుక్రీస్తు. మానవుడైన లాజరు కోసం ఆయన కన్నీరు విడిచారు.

**యోహాను 11:35**

లాజరును యేసుక్రీస్తు ఎంతగా ప్రేమించాడో మనం చూడగలుగుతాము. మరణించిన లాజరుని, జీవములేని లాజరుని, యేసుక్రీస్తు లాజరు బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా చనిపోయిన లాజరు తిరిగి జీవములోనికి వచ్చాడు. లాజరు జీవితం మనల్ని విశ్వాసంలోకి నడిపిస్తుంది.

**జీవాహారము జ్ఞాపకం చేసుకోవటం**

**లూకా 22 : 19,20** పిమ్మట ఆయన యొక రొట్టె పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దాని విరిచి, వారి కిచ్చి – ఇది మీ కొరకు ఇయ్యబడుచున్న నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటక దీనిని చేయుడని చెప్పెను. [20] ఆ ప్రకారమే భోజనమైన తరువాత ఆయన గిన్నెయు పట్టుకొని ( ఈ గిన్నె మీకొరకు చిందింపబడుచున్న నా రక్తము వలననైన క్రొత్త నిబంధన. [21] ఇదిగో నన్ను అప్పగించు వాని చెయ్యి నాతోకూడ ఈ బలమీద ఉన్నది.

**జీవాహారములో ఉన్న లక్షణాలు:–**

1. జీవాహారంలో పరిశుద్ధత ఉంది.
2. జీవాహారంలో జీవముంది.
3. జీవాహారములో ప్రేమ ఉంది.

**గమనిక:**

సాతాను మన శరీరమును అపవిత్ర పరచడానికి ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అపవిత్రమైన ఆహారమును తినడం వల్ల, దేవుని బిడ్డలమైన మనము మనకు తెలియకుండానే, పవిత్రతను కోల్పోతుంటాము. కాబట్టి మన ఆహార పదార్ధాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పరిశుద్ధమైనవి మాత్రమే తినడానికి మనం ప్రయత్నించాలి.

**1రాజులు 19:7**

అయితే యెహోవా దూత రెండవ మారు వచ్చి అతని ముట్టి నీ శక్తికి మించిన ప్రయాణము నీకు సిద్ధమై యున్నది, నీవు లేచి భోజనము చేయుమని చెప్పినప్పుడు...

మనకు శక్తికి మించిన ప్రయాణము ఉంది, కాబట్టి శరీర ఆహారము ఎలాగున రోజు తీసుకుంటామో ఆలాగునే జీవాహారము రోజు తప్పనిసరిగా తీసుకోవాలి.

**ముగింపు :** పరిశుద్ధ శరీర రక్తము తీసుకునే మనమందరము యేసుక్రీస్తు మనకోసము మన పాపముల నిమిత్తం ఆయన శరీర రక్తమును చిందించారు అన్న విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి. మనకోసము ఆయన శరీరమును రొట్టెగా, ఆయన రక్తమును ద్రాక్షారసముగా మార్చారు. పరిశుద్ధ శరీర బల్లలో మనము యోగ్యముగా తీసుకోవడానికి మనల్ని మనము సిద్ధపరచుకోవాలి. యేసుక్రీస్తుని మనము జ్ఞాపకం చేసుకుంటూ బల్ల అనుభవంలో మనము ఉండాలి.

నా తండ్రి రాజ్యములో మీతో కూడా నేను ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినము వరకు ఇంకను దీనిని త్రాగనని మీతో చెప్పుచున్నాననెను. తండ్రి రాజ్యము వచ్చేంతవరకు యేసుక్రీస్తు (కుమారుడు) ద్రాక్షారసము త్రాగనని

స్పష్టముగా చెబుతున్నారు. యేసుక్రీస్తును ఎరిగిన బిడ్డలమైన మనము ఆయనని జ్ఞాపకం చేసుకోవడం కోసం ఆయన శరీర రక్తములనుతీసుకోవాలి.

మనమందరము తండ్రి రాజ్యములో యేసుక్రీస్తుతో కలిసి ఆయన శరీర రక్తమును తీసుకోవడం కోసం నిరీక్షణ కలిగి ఉండాలి. కొత్త నిబంధన కాలంలో యేసుక్రీస్తు ఆయన శిష్యులతో కలిసి ద్రాక్షారసము తీసుకున్నాడు, అదేవిధంగా తండ్రి రాజ్యములో మన అందరితో కలిసి జీవాహారమును తీసుకుంటారు. అందుకు మనమందరము సిద్ధపడి నిరీక్షణ కలిగి ఉండాలి.

అలాంటి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి దయచేయును గాక. ఆమేన్.